క్లుప్తంగా

కేటీఆర్ సభలో అపశ్రుతి

● వార్డు సభ్యుడికి గాయాలు



బొమ్మకంటి ఆనందం

శాయంపేట : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభలో అపశ్రుతి చోటు చేసుకుంది. సభ ముగిశాక తిరుగు ప్రయాణం సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన రెండో వార్డు సభ్యుడు బొమ్మకంటి ఆనందం తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా యువనేత గౌతంరెడ్డి ఆనందంను ఆస్పత్రిలో కలిసి పరామర్శించారు. ఆనందం ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు గౌతంరెడ్డి సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

ఆత్మకూరు : అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి కోరారు. మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. పనులు సకాలంలో, నాణ్యతతో జరిగేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కడపాక రాజేందర్, పీడీఎస్‌యూ సెక్రటరీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు, బియ్యం అందజేత



ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన గుడికందుల అశోక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి టెన్త్ చదువుకున్న మిత్రులు శుక్రవారం రూ.14 వేల నగదు, క్వింటా బియ్యం సాయంగా అందించి అండగా నిలిచారు. తొలుత అశోక్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో అశోక్ మిత్రులు వెంకటేశ్, పురుషోత్తం, మధు, కుమార్, దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున హనుమకొండలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ప్రకటనలో వివరించారు.

పేకాట శిబిరంపై దాడి

కాజీపేట: కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ కాలనీలో ఓ ఇంట్లో రహస్యంగా కొంతమంది పేకాట ఆడుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, నాసిర్‌పాషా, మాచర్ల శ్వేతతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తి ఆర్టీసీ కాలనీలోని రామాలయంలో సీతా లక్ష్మణ సమేత రామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని చివరి రోజు హోమం, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం జరిపించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

పీఆర్సీ ప్రకటించాలని నిరసన

హన్మకొండ: పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు ఆనందం మాట్లాడుతూ విద్యుత్ సంస్థల యజమాన్యాలు పీఆర్సీ ప్రకటించడంలో జాప్యం చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు రంగారావు, రమణారెడ్డి, అజ్మీర శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ పాలనకు గోరీ కట్టాలి

● బీజేపీ నేత విజయ్‌చందర్‌రెడ్డి



పరకాల : మాట్లాడుతున్న డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి

పరకాల : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సాగిస్తున్న దోపిడీ పాలనకు గోరీ కట్టాలని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి కోరారు. మండలంలోని మల్లక్‌పేటలో శుక్రవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి శక్తి కేంద్రం ఇన్‌చార్జి దయ్యాల దేవరాజ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విజయ్‌చందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ, దళితులకు భూపంపిణీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, తదితర అనేక హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జ సత్యనారాయణరావు, మండల అధ్యక్షుడు పి.రవీందర్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం

ఎల్కతుర్తి : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నేత చాడ శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల, దళితులకు మూడెకరాల భూమి, నియోజకవర్గానికి వంద పడకల ఆసుపత్రి, తదితర అనేక హామీలు నెరవేర్చలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు దండ దేవేందర్‌రెడ్డి, నాంపెల్లి అశోక్, సదానందం, కంచర్ల శంకరయ్య, జనగాని కిష్టయ్య, కోరె కార్తీక్, పల్లెపాటి మధుకర్, రంగారెడ్డి, పెరుకు మధు, స్వాతి, మమత, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు మత్స్య సొసైటీల్లో సభ్యత్వం



పరీక్షల్లో పాల్గొన్న మత్స్యకారులతో ఏడీ భారతి, తదితరులు

ఐనవోలు : అర్హులకు మత్స్య సొసైటీల్లో సభ్యత్వం కల్పించనున్నట్టు మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) భారతి తెలిపారు. మండలంలోని సింగారం గ్రామ ఊరచెరువులో గ్రామానికి చెందిన 61 మంది ముదిరాజ్ కులస్తులకు శుక్రవారం ఈత కొట్టడం, విసురుడు వల వేయడం, పెద్ద వల లాగడం, తెప్ప మీద వెళ్లి చేపలు పట్టడం, తదితర అంశాల్లో నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఏడీ భారతి హాజరై పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. 18 ఏళ్లకుపైబడ్డ వయస్సు కలిగిన ముదిరాజ్ కులస్తులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారిని మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీలో సభ్యులుగా చేరుస్తామని చెప్పారు. గ్రామ సొసైటీలో గతంలో 73 మంది ఉండగా వారిలో 33 మంది చనిపోగా ప్రస్తుతం 40 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు బుస్స మల్లేశం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు సభ్యత్వం కల్పించాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వి.వెంకటేశ్వర్లు, ముత్యాల ఉప్పలయ్య, ఇండ్ల కుమారస్వామి, బొల్లు రాములు, సొనబోయిన సతీష్ పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ ఎన్నికలకు 42 నామినేషన్లు దాఖలు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక మత్స్య పారిశ్రామిక సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ చేయగా 9 డైరెక్టర్ స్థానాలకు 42 నామినేషన్లు దాఖలైనట్టు ఎన్నికల అధికార విజయ్‌భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లను స్క్రూటినీ అనంతరం 42 మంది బరిలో ఉన్నట్టు పేర్కొన్నారు. ఈనెల 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ ముగియగానే తుది జాబితాను ఎన్నికల చిహ్నాలతో సాయంత్రం 5 గంటలకు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. పెద్దకోడెపాక గ్రామంలోని రైతు వేదికలో మార్చి 2న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తామని వివరించారు. ఎన్నికల నిర్వహణకు సభ్యులు సహకరించాలని కోరారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామంలో ముదిరాజ్ కులస్తులు శుక్రవారం పెద్దమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే మహిళలు భక్తి శ్రద్ధలతో ఇళ్లలో బోనాలు తయారు చేశారు. సాయంత్రం గ్రామంలోని ముదిరాజ్ కుల మహిళలందరూ నెత్తిపై బోనాలు పెట్టుకుని డప్పు చప్పుళ్లతో గ్రామ శివారులోని పెద్దమ్మ గుడికి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి మల్లికాంబ, ఉపసర్పంచ్ ప్రతాప్, ముదిరాజ్ కుల పెద్దలు లింగయ్య, సురేష్, మల్లేశం, నాగరాజు, నారాయణ, సమ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని బ్యాంక్ మేనేజర్ ధరావత్ గిర్మోజీ నాయక్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావులతో కలిసి సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిర్మోజీ నాయక్, సంపత్‌రావు, దేవేందర్‌రావు మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఆధార్ కార్డుల్లో దొర్లిన తప్పులను సవరించుకుని కొత్త కార్డులు పొందవచ్చని చెప్పారు. ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆధార్ నమోదు కేంద్రం ఆపరేటర్లు జక్కు సాయిచరణ్‌గౌడ్, జక్కు రాజుగౌడ్, పుల్లూరి శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది భారతి, అనిత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వైద్య విద్యార్థిపై ర్యాగింగ్ పాల్పడిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, బాధితురాలు ప్రీతికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ కుమార్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని సూచించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు అండర్ బ్రిడ్జ్ బస్టాప్ వద్ద ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైఫ్ తనను వేధిస్తున్నాడని ప్రిన్సిపాల్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రిన్సిపాల్ పట్టించుకోకపోవడంతోనే ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రతినిధులు తాళ్ల రహేల, బచ్చల స్వప్న, గజ్జి సత్య, రాణి, శ్రీలత, సంధ్య, వసంత, అరుణ, రాధిక, రమేష్ పాల్గొన్నారు.

పరిశోధనలపై అవగాహన అవసరం



ప్రొఫెసర్ దినకర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

హన్మకొండ అర్బన్: మానవాళికి సైన్స్ అనేక రకాలుగా ఉపయోగపడుతోందని, ఈక్రమంలో సైన్స్‌లో పరిశోధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి సూచించారు. జాతీయ సైన్స్ వారోత్సవాల్లో భాగంగా భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెటీరియల్ సైన్స్, మెడికల్ ఇంప్లాంట్స్ అనే అంశంపై కళాశాలలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ దినకర్ మాట్లాడుతూ వైద్యరంగం, మానవ శరీరంలో ఉపయోగించే ఇంప్లాంట్స్ తయారీ, వాడకంలో మెటీరియల్ సైన్స్ పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి సీహెచ్.స్నేహలతారెడ్డి, డాక్టర్ బాపూజీ వాగేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, రేణుక, పార్వతి, శిరీష, అరుణ, సావిత్రి, మహ్మద్ రఫీ, పాల్గొన్నారు.

గుడిబడికి బెస్ట్ రన్నర్స్ స్వచ్ఛంద సంస్థ చేయూత

కాశిబుగ్గ: కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి) అభివృద్ధికి బెస్ట్ రన్నర్స్ స్వచ్ఛంద సంస్థ ఎప్పుడూ ముందుంటుందని సంస్థ సభ్యుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ముక్కా శ్రీనివాస్ తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో రూ.70 వేల ఆర్థిక సహకారంతో పాఠశాలలో అభివృద్ధి చేసిన మూడు తరగతి గదులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ రాష్ట్రంలోని పలు పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కుంట రవికుమార్, కుమారస్వామి, వీరేశలింగం, అజయ్‌బాబు, శ్రవణ్‌కుమార్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంహెచ్ఓకు అభినందనలు



రాజేష్‌కు బుద్ధ విగ్రహం అందజేస్తున్న నాయకులు

వరంగల్ అర్బన్: బల్దియా సీఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రాజేష్‌ను బల్దియా ప్రధాన కార్యాలయంలో పలు సంఘాల నాయకులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను భాస్కర్, సమాచారం హక్కు అవగాహన సమితి అధ్యక్షుడు కొంగర వరుణ్, ఆరె కటిక సంఘం నాయకులు రఘు ఉన్నారు.

భర్తను చంపిన భార్య

ధర్మసాగర్ : మండల కేంద్రంలో భర్తను భార్య పార కర్రతో కొట్టగా ఆయన అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సోమ వెంకటేశ్వర్లు (60) 15 ఏళ్ల క్రితం మానసిక పరిస్థితి సరిగా లేక హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అప్పటి నుంచి అతని భార్య సోమ స్వరూపతో గొడవపడుతూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఈ పరిస్థితుల్లో స్వరూప కొద్ది రోజులు వెంకటేశ్వర్లును వదిలి మళ్లీ తిరిగి వచ్చేది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం వెంకటేశ్వర్లు భార్యతో గొడవపడి వేధించగా ఆ బాధను భరించలేని ఆమె పారకొర్రతో కొట్టగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కూతురు దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

హన్మకొండ చౌరస్తా: అంతర్జాతీయ ప్రింటర్స్ డేను పురస్కరించుకుని యునిటీ ప్రింటర్స్ సొసైటీ హనుమకొండ ఆధ్వర్యంలో పెద్దమ్మగడ్డ శివారులోని స్వయంకృషి ఆశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ భరద్వాజ్ మాట్లాడుతూ అక్షరాలకు రూపం సమకూర్చే తమ వృత్తిని గౌరవిస్తూ, జిల్లావ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పోలంపెల్లి మహేశ్వర్, కోశాధికారి గుండా ప్రవీణ్‌కుమార్, సభ్యులు సీహెచ్.ఎల్లారెడ్డి, ఉపేందర్, పాకిడే రాజేష్, రమేష్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి బ్యాగు అప్పగింత



బాధితుడికి బ్యాగు అందిస్తున్న పోలీసులు

కాజీపేట: విలువైన పత్రాలు, నూతన వస్త్రాలున్న బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోగా బాధితుడికి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మాచర్ల శ్వేత శుక్రవారం సాయంత్రం అందించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చంద్రమణి కాజీపేట చౌరస్తాలో ఆటో ఎక్కి సుబేదారిలో దిగిపోయాడు. ఆటోలోనే బ్యాగ్ మరిచిపోయినట్లుగా గుర్తించిన ఆటో డ్రైవర్ రహీం యూనియన్ నాయకుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించాడు. చంద్రమణిని స్టేషన్‌కు పిలిపించి పోలీసులు బ్యాగును అందించారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, యూనియన్ అధ్యక్షుడు దార సూరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే అరూరి రమేష్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మండలంలోని ముల్కలగూడెం గ్రామానికి చెందిన నాయిని శ్రీనివాస్, బండి రాజేష్‌లకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి ఇండ్లకు వెళ్లి శుక్రవారం ఆయన అందజేశారు. అనంతరం అరూరి రమేష్ మాట్లాడారు. శ్రీనివాస్‌కు రూ.39 వేల, రాజేష్‌కు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా అందజేసినట్టు తెలిపారు. ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు గుంశావలీ, ఎంపీటీసీలు మేరుగు రాజేందర్, కొత్తూరి కల్పన, రైతు సంఘం నాయకుడు రాఘవులు, సొసైటీ డైరెక్టర్ భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ రామిండ్ల స్వప్న, నాయకులు జక్కుల రాజు, కొత్తూరి మధుకర్, శ్రీరామోజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో అంధత్వ నివారణ



ఎల్కతుర్తి : పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్



శాయంపేట : కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అంధత్వ నివారణ జరుగనుందని సర్పంచ్ సామెల జమున సురేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెంచికలపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాన్ని అంధత్వ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అర్హులందరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకుని నేత్ర సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం పలువురికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంపత్‌రెడ్డి, పీఎంఓ గణేష్, ఎంపీటీసీ చెవుల కొమురయ్య, వార్డు సభ్యులు రమేష్, భూపతిరెడ్డి, మౌనిక, రమాదేవి, రీటా, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరాన్ని వినియోగించుకోవాలి

శాయంపేట : కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని హుస్సేన్‌పల్లి సర్పంచ్ గుండెకారి రజిత శ్రీనివాస్ కోరారు. మండలంలోని ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లకుపైబడ్డ వయస్సు కలిగిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైతే కళ్లద్దాలు ఇస్తారని, శస్త్రచికిత్స చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాయరాకుల మొగిలి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డు సభ్యులు శంకర్‌రావు, సుధాకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం



ఊరేగింపులో సందడి చేస్తున్న కళాకారులు

మడికొండ: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక రథంలో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. మడికొండలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నీళ్ల బిందెలతో రథానికి ఎదురేగి నీళ్ల ఆరపోస్తూ మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ, స్వామివారి ఆశీర్వచనాలు పొందారు. రథోత్సవంలో భాగంగా కోలాటం, గొల్లడప్పులు, భజన బృందాలు, చిరుతల రామాయణం, నృత్యాల మధ్య రథం ముందుకు సాగింది. వేడుకల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరశురాం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, మునిగాల సరోజన, ఆవాల రాధికరెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ దువ్వ నవీన్, ధర్మకర్తలు చింతకుంట్ల భూపాల్‌రెడ్డి, ఓర్సు రాజు, పెద్ది ప్రభాకర్, బుర్ర సంధ్యారాణి, రాజన్‌బాబు, కుమారస్వామి, దువ్వ శ్రీకాంత్, పోలెపల్లి రామమూర్తి, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, తొట్ల రాజుయాదవ్, సిబ్బంది భాస్కర్, రణధీర్, అనిల్, గ్రామస్తులు బొల్లికొండ వినోద్, వల్లెపు ఉపేందర్, వెన్నమల్ల రమేష్, జగదీశ్వర్, నర్ర రమేష్, భక్తులు పాల్గొన్నారు.

రేపు బీసీల ఆత్మీయ అభినందన సభ



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం మైదానంలో ఈనెల 26న జరగబోయే బీసీల ఆత్మీయ అభినందన సభను విజయవంతం చేయాలని కేయూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం నిర్వహించిన బీసీ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన బైరి రవికృష్ణ, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కల్కచర్ల శ్రీనివాస్‌కు ఈనెల 26న బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బుర్ర ప్రవీణ్, ఉపాధ్యక్షుడు లింగరాజు, నర్సింహ, విజయ్, వెంకటేష్, ప్రభాకర్, శ్రీనివాస్, సంగిలాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు 'గణితం'పై పట్టు సాధించాలి



కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మ్యాథ్స్ గైడ్‌లతో విద్యార్థులు

కరీమాబాద్: ప్రతీ విద్యార్థి గణితశాస్త్రంపై పట్టు సాధించాలని రీజనల్ సైన్స్ సెంటర్ అధికారి వి.వెంకటేశ్వర్‌రావు సూచించారు. నేషనల్ మేథమెటిక్స్ డే ఉత్సవాల్లో భాగంగా కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్రంపై శుక్రవారం వ్యాసరచన, డ్రాయింగ్, మ్యాథ్స్ మోడల్స్‌పై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితశాస్త్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. విద్యార్థులు గణితంపై పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. జాతీయ స్థాయిలో నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఉపాధ్యాయురాలు కొటం ధనలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ డి.రవి, ఉపాధ్యాయులు భార్గవి, రాజ్యలక్ష్మి, శేషాచారి, అభినవ్, రాజయ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి.రాజ్‌కుమార్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274